



బుసక తవ్వకాలతో ప్రమాదకరంగా మారిన కరెంటు స్తంభాలు

అధికారం చేతిలో ఉంటే, ఎంత అడ్డగోలుగా వ్యవహరించవచ్చో గత వైసీపీ పాలన చూస్తే అర్థమవుతుంది. ప్రభుత్వం మారినా అప్పటి అక్రమాలకు సాక్ష్యాలు మాత్రం ఇంకా భయపెడుతూనే ఉన్నాయి. ఇందుకు వల్లూరుపాలెంలోని బుసక అక్రమ తవ్వకాలే నిదర్శనం. 2019కు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ, పట్టా భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడగా, వైసీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక నాయకులు ఆ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరిపి, బుసక అమ్ముకుని రూ.కోట్లు గడించారు. కృష్ణానదీ ప్రవాహానికి దగ్గరగా తవ్వకాలు జరపడంతో ప్రస్తుతం ఇక్కడ ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయి.

అడ్డగోలు అక్రమాలు

కృష్ణానదిపాయలో వైసీపీ నేతల బుసక అక్రమ తవ్వకాలు



లంకలో ప్రభుత్వ భూమిలో జరిపిన బుసక తవ్వకాలు

- గతంలోనే టీడీపీ హయాంలో ఆక్రమణలకు అడ్డు
- ప్రభుత్వ భూములంటూ బ్యానర్ ఏర్పాటు
- వైసీపీ వచ్చాక కొల్లగొట్టేసిన స్థానిక నాయకులు
- భారీగా బుసక తవ్వేసి రూ.కోట్లలో ఆర్జన
- భారీ తవ్వకాలతో ప్రమాదకరంగా కృష్ణానది పాయ
- పూర్తిగా సహకరించిన అప్పటి అధికారులు

తోట్లవల్లూరు : వల్లూరుపాలెంలో కృష్ణానదీపాయ (సౌత్ పరిధి) పక్కనే విశాలమైన ప్రభుత్వ భూములున్నాయి. వాటి దగ్గర్లోనే కొంత మంది రైతుల పట్టా భూములున్నాయి. అప్పట్లో ఈ భూములు ఖాళీగా, ముళ్లచెట్లు పెరిగి ఉండేవి. 2019కు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ భూములను పేదలకు పంచాలని సీపీఎం నాయకులు ఉద్యమాలు చేశారు. భూముల్లోకి ప్రవేశించి ముళ్లచెట్లు తొలగించి, కొంత భూమిని బాగు చేశారు. మూడు నెలల పాటు భూములు బాగు చేశారు. దీంతో నాటి తహసీల్దార్ జి.భద్రు.. అవి ప్రభుత్వ, పట్టా భూములని, ఆక్రమిస్తే శిక్షార్హులవుతారని వీఆర్వోలతో బ్యానర్ కట్టించి పోలీసులకు తెలిపారు. ఇలా ప్రభుత్వ భూముల్లోకి సీపీఎం నాయకులు, పేదలు రాకుండా అధికారులు కట్టడి చేశారు.

వైసీపీ ప్రభుత్వం వచ్చాక..

2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక సదరు నేతల కన్ను ఈ భూములపై పడింది. అధికారుల అండతో అక్కడున్న భూములన్నీ పట్టా భూములుగా ప్రకటించేశారు. కొందరు రైతులు భారీగా ముడుపులు ముట్టజెప్పి పట్టా భూములుగా మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2020-22 మధ్య జగనన్న కాలనీల మెరకకు బుసక అవసరమైంది. దీంతో వైసీపీ నేతలు స్కెచ్ వేశారు. ఉన్నతాధికారులు నిబంధనలను సైతం పక్కన పెట్టేసి బుసక తవ్వకాలకు పచ్చ జెండా ఊపేశారు. దీంతో సుమారు 20 ఎకరాల్లో రేయింబవళ్లు బుసక తవ్వకాలు సాగాయి. కొందరు రైతులు ఎకరాకు రూ.5 లక్షలు తీసుకుని ఆ భూములను నేతలకు అప్పగించేశారు.



ప్రభుత్వ, పట్టా భూములంటూ బ్యానర్ కడుతున్న వీఆర్‌ఏ (ఫైల్)

ఆ భూమిని పేదలకు పంచాలి



2018-19 మధ్య కాలంలో మా సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో మూడు నెలల పాటు పేదలను ఇక్కడకు తీసుకొచ్చి ముళ్లచెట్లు కొట్టించి, భూములను బాగు చేయించాం. ఇక్కడ 329 సర్వే నెంబరులో 214 ఎకరాల ప్రభుత్వ భూములున్నట్టు అధికారులు చెప్పటంతో వాటిని పేదలకు పంపిణీ చేయాలని ఉద్యమించాం. నాటి రెవెన్యూ అధికారులు మమ్మల్ని అడ్డుకున్నారు. ఆ తర్వాత అధికారులు పట్టా భూములుగా చెప్పి బుసక తవ్వకాలు జరిపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం 214 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి పేదలకు పంపిణీ చేయాలి.

- జుజ్జువరపు యేసేబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు

ప్రమాదకరంగా..

బుసక తవ్వకాలు ఎంత అడ్డగోలుగా జరిగాయో అక్కడున్న కరెంటు లైన్లు చెబుతున్నాయి. బుసక తీసి భూములను సాగు చేసుకుంటామని ఉన్నతాధికారులను నమ్మించి, ఇప్పుడు అసలు సాగుకే పనికిరాకుండా చేశారు. ప్రస్తుతం ఈ భూములు లోయలుగా దర్శనమిస్తున్నాయి. వరద పారే అంచుకు మీటరు దూరం కూడా లేకుండా బుసక తవ్వేశారు. మైనింగ్, భూగర్భ జలవనరుల శాఖల అనుమతి లేకుండా కేవలం రెవెన్యూ అధికారుల అండతోనే ఈ తవ్వకాలు జరిగాయి. కొత్తగా ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ బుసక అక్రమ తవ్వకాలపై తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



శుక్రవారం ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఆషాఢ శోభ

నేటి నుంచి ఇంద్రకీలాద్రిపై ఆషాఢ ఉత్సవాలు

- తొలిసారె సమర్పించనున్న దేవస్థాన సిబ్బంది
- భక్తులు సారె సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
- నేటి నుంచి 16వ తేదీ వరకూ వారాహి నవరాత్రులు
- 19 నుంచి మూడు రోజులు శాకంబరీ ఉత్సవాలు

వన్‌టౌన్, జూలై 5 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు ఆషాఢమాస ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈవో కేఎస్ రామారావు పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బందులు లేకుండా సారె స్వీకరణ, అమ్మవారి దర్శనం, పూజాధికాలు, తదితరాలపై పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవో చాంబరులో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు సామూహికంగా సారె సమర్పించేందుకు ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నారు. శనివారం ఉదయం 8 గంటలకు వైదిక కమిటీ, పరిపాలన విభాగ సిబ్బంది, ఇతరులు కనకదుర్గానగర్ నుంచి ఊరేగింపుగా కొండపైకి చేరుకుని ఈవో రామారావు ఆధ్వర్యంలో అమ్మవారికి తొలిసారె సమర్పిస్తారు. కాగా, ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు శాకంబరీ ఉత్సవాలు జరుగుతాయి. 19వ తేదీ ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమై 21వ తేదీ ఉదయం 9.30 గంటలకు పూర్ణాహుతితో ముగుస్తాయి.

వారాహి నవరాత్రులు

ఇంద్రకీలాద్రిపై తొలిసారిగా శనివారం నుంచి 16వ తేదీ వరకు వారాహి నవరాత్రులు నిర్వహించనున్నారు. దేవస్థానం వైదిక కమిటీ అంతర్గతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. శనివారం ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, రుత్విక్‌వరణం, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ జరుగుతాయి. సాయంత్రం 4 గంటలకు కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠాపన, మండపారాధన, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ చేస్తారు. 9 రోజుల పాటు జపాలు, హోమాలు జరుగుతాయి. 15వ తేదీ ఉదయం 10 గంటలకు పూర్ణాహుతితో వారాహి నవరాత్రులు ముగుస్తాయి.

ఆక్సిజన్ ప్లాంట్.. మూలకు..!

రూ.3 కోట్ల విలువైన ప్లాంట్ నిరుపయోగం

- ప్రారంభించిన రెండేళ్లకే పక్కన పెట్టేశారు
- రిపేరు చేయించకుండా ప్రైవేట్ కాంట్రాక్టర్‌పై ప్రేమ
- ప్రైవేట్ ఆక్సిజన్ వినియోగానికే పెద్దపీట
- కాంట్రాక్టర్‌కు నెలకు రూ.50 లక్షల చెల్లింపులు
- విజిలెన్స్ అధికారుల విచారణ



(విజయవాడ-ఆంధ్రజ్యోతి/ప్రభుత్వాసుపత్రి) : కరోనా సమయంలో ఆక్సిజన్ సరఫరాను నిరంతరాయంగా అందించేందుకు ఏర్పాటుచేసిన కొత్త ప్రభుత్వాసుపత్రిలోని ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ మూలనపడింది. పీఎం కేర్స్ నిధులతో దీన్ని ఏర్పాటు చేశారు. అప్పటి వరకు ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఆక్సిజన్ కొనుగోలు చేసి, ట్యాంకర్లలో భద్రపర్చుకుని వినియోగించేవారు. 3వేల లీటర్ల ఆక్సిజన్‌ను ఉత్పత్తిచేసే ఈ ప్లాంట్ ఏర్పాటుతో ప్రైవేట్ సరఫరాదారులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండాపోతుందని అంతా భావించారు. కానీ, కాసుల కక్కుర్తితో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

ప్రైవేట్ ఆక్సిజనే ఆధారం

రూ.3 కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుచేసినా ప్రైవేట్ కాంట్రాక్టర్లు సరఫరా చేసే ఆక్సిజన్‌పైనే ఆసుపత్రి అధికారులు ఆధారపడుతున్నారు. ప్రైవేట్ కాంట్రాక్టర్లకు నెలకు రూ.25 లక్షల చొప్పున చెల్లిస్తూ ఆసుపత్రి నిధులను దుర్వినియోగపరుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తంగా నెలకు రెండు ఆసుపత్రుల్లోనూ వంద టన్నుల ఆక్సిజన్ వినియోగమవుతుందని అంచనా. టన్నుకు సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల చొప్పున కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్నారు. ఉన్న ప్లాంట్‌ను బాగు చేసుకోలేని అధికారులు ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు మాత్రం పెద్దపీట వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆక్సిజన్ ప్లాంట్.. ప్రైవేట్ సరఫరాదారులపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఎంతకాలం నుంచి ప్లాంట్‌ను పక్కన పెట్టారు, ఇప్పటి వరకు ప్రైవేట్ వ్యక్తులకు ఎంతమేర చెల్లింపులు జరిపారన్న అంశాలపై ఆరా తీస్తున్నారు.

పత్తాలేని పత్రాలు

జిల్లాలో స్వచ్ఛాంధ్రప్రదేశ్ వాహనాలకు అవస్థలు

వాహనాలేమో స్థానిక సంస్థలకు అప్పగింత

- డాక్యుమెంట్లు మాత్రం స్వచ్ఛాంధ్ర విభాగం వద్ద..
- మరమ్మతులైనా, రెన్యువల్‌కైనా అందని పత్రాలు
- నిలిచిపోయిన రెన్యువల్, ఇన్సూరెన్స్, ఇతర పనులు
- ప్రమాదం జరిగినా ఏం చేయాలో తెలియని పరిస్థితి

పంచాయతీలకు అప్పగించకుండా కావాలనే జాప్యం



చెత్త సేకరణ వాహనం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లో చెత్తసేకరణ నిమిత్తం స్థానిక సంస్థలకు గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన వాహనాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ వాహనాలకు సంబంధించిన పత్రాలను స్థానిక సంస్థలకు అప్పగించలేదు. వీటి నిర్వహణ ఎవరు చూడాలనే అంశాన్ని కూడా అలాగే వదిలేశారు. ఈ వాహనాలకు రోజువారీ డీజిల్ ఖర్చులు, డ్రైవర్ల జీతాలను స్థానిక సంస్థలే భరిస్తున్నాయి. అయితే, ఎక్కడైనా ప్రమాదానికి గురైతే సరైన పత్రాలు లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రమాదానికి గురైన బాధితులకు పరిహారం చెల్లింపులోనూ జాప్యం జరుగుతోంది.

జిల్లాలో 300కుపైగా వాహనాలు

జిల్లాలో 474 పంచాయతీలు, మచిలీపట్నం కార్పొరేషన్‌తో పాటు గుడివాడ, పెడన, ఉయ్యూరు, తాడిగడప పురపాలక సంఘాలు ఉన్నాయి. స్వచ్ఛాంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమంలో భాగంగా పంచాయతీలు, పురపాలక సంఘాల్లో ఇంటింటికీ తిరిగి తడి, పొడిచెత్త సేకరించేందుకు 300కు పైగా వాహనాలను కేటాయించారు. టాటా ఇంట్రా, ఈ-వెహికల్స్ ట్రాక్టర్లు, ఆటోలు, చెత్త డంప్‌లను, యంత్రాల ద్వారా లోడ్ చేసుకునే ఐషర్ (కాంపాక్టర్) వంటి పెద్ద వాహనాలను కూడా ఇచ్చారు. ఇంతా చేసినా.. వీటికి సంబంధించిన పత్రాలు మాత్రం పురపాలక సంఘాలు, పంచాయతీలకు అప్పగించలేదు. ప్రతి ఆరు నెలలకు లేదా ఏడాది తర్వాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవడంతో పాటు రెన్యువల్ కూడా చేయించాలి. ఇన్సూరెన్స్ నగదు చెల్లించాలి. అయితే, ఈ వాహనాలకు సంబంధించి పత్రాలు లేకపోవడంతో రెన్యువల్ చేయించే అవకాశం లేకుండాపోయింది. మరమ్మతులకు గురై, అధికమొత్తంలో నగదు ఖర్చుచేసి రిపేర్లు చేయించాల్సి వస్తే పంచాయతీలు, పురపాలక సంఘాల వద్ద సరైన పత్రాలు ఉండట్లేదు. దీంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇక రవాణా శాఖ అధికారుల సాధారణ తనిఖీల్లో పత్రాలు లేకుండా పట్టుబడితే ఆ వాహనాలను రహదారులపై తిరగకుండా పక్కన పెట్టేస్తున్నారు. ఆ తర్వాత రవాణా శాఖ అధికారులకు పరిస్థితిని తెలియజేసి వాహనాలను విడిపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

డీపీవో కార్యాలయానికి అప్పగించామని చెప్పి..

ఈ వాహనాలకు సంబంధించిన పత్రాలన్నీ స్వచ్ఛాంధ్రప్రదేశ్ విభాగం వద్దే ఉండిపోయాయి. వాహనాలు ఏదైనా ప్రమాదానికి కారణమైన సమయంలో కూడా స్వచ్ఛాంధ్రప్రదేశ్ విభాగం అధికారులకు సమాచారం తెలియజేస్తే, వారు వీలు కుదిరినప్పుడు వచ్చి పత్రాలు ఇస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ పాలకవర్గాలు స్వచ్ఛాంధ్రప్రదేశ్ విభాగం అధికారులకు తెలియజేయగా, సమస్యను సరిదిద్దుతామని చెప్పి రెండేళ్లుగా జాప్యం చేస్తున్నారు. ఈ వాహనాల పర్యవేక్షణతో పాటు మొత్తం వ్యవహారాలను జిల్లా పంచాయతీ కార్యాలయం చూస్తోందని, జిల్లాస్థాయిలోనే సరిచేసుకోవాలని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై టీడీపీ కూటమి ప్రభుత్వం దృష్టిసారించి చెత్త సేకరణ కోసం ఇచ్చిన వాహనాల పత్రాలను స్థానిక సంస్థలకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



విజయవాడలో పట్టుబడిన నకిలీ సిగరెట్ల బాక్సులు

పొగ.. పాగా..

కృష్ణా, గుంటూరు జిల్లాల్లో నకిలీ సిగరెట్ల మాఫియా

- రూ.కోట్లలో నకిలీ సిగరెట్ల వ్యాపారం
- ఉత్తరాది ముఠాలతో సత్సంబంధాలు
- ప్రైవేట్ కొరియర్ల ద్వారా వస్తున్న సరుకు
- పన్నుల చెల్లింపులకు ఎగనామం
- పట్టుబడిన పాట్నా సరుకు వెనుక ఉన్నదెవరు?

> అమరావతికి అటువైపు ఉన్న గుంటూరు, ఇటువైపు ఉన్న ఉమ్మడి కృష్ణాజిల్లాలో పొగ మాఫియా పాతుకుపోతోంది. నకిలీ సిగరెట్ల చెలామణీకి రెండు జిల్లాలు కేంద్ర బిందువులుగా మారుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సరుకుకు ఉమ్మడి కృష్ణాజిల్లాను కేంద్రంగా మార్చుకుంటున్నారు. అసలు బ్రాండ్లను పోలి ఉండే నకిలీ సిగరెట్లను తెచ్చి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : రాష్ట్రం మొత్తంలో నకిలీ సిగరెట్లకు కేరాఫ్‌గా కృష్ణా, గుంటూరు జిల్లాలు మారాయి. ఈ మాఫియా తీరుతో అసలు కంపెనీలు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ మాఫియా రెచ్చిపోవడానికి సీజీఎస్టీ, కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ శాఖల అధికారుల నిర్లక్ష్యం ప్రధాన కారణంగా తెలుస్తోంది.

తెరవెనుక ఎవరు?

బిహార్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఈ నకిలీ సిగరెట్లు ఎక్కువగా తయారవుతాయి. అక్కడి నుంచి సరుకును మన రెండు జిల్లాలకు చెందిన మాఫియా ప్రైవేట్ కొరియర్లలో తెప్పిస్తోంది. నిబంధనల ప్రకారం ఒక పార్శిల్‌ను కొరియర్ చేసినప్పుడు అందులో ఉన్న వస్తువులు ఏమిటన్నది ఆయా సంస్థల ప్రతినిధులు పరిశీలించాలి. అలాంటిది నకిలీ సిగరెట్లు ఏకంగా కొరియర్లలో రాష్ట్రాలు, నగరాలు దాటి రావడం వెనుక సదరు కొరియర్ సంస్థల పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకుముందు ఈ మాఫియా ప్రత్యేకంగా కంటైనర్లను బుక్ చేసుకుని సరుకును తెచ్చేది. ఈ సమాచారం తెలుసుకున్న సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు టోల్‌ప్లాజాల వద్ద తనిఖీలు చేయడంతో ఈ నకిలీ సిగరెట్ల బాగోతం వెలుగులోకి వస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కంటైనర్లు వరుసగా సీజీఎస్టీ, కస్టమ్స్ బృందాలకు పట్టుబడుతుండడంతో మాఫియా కొత్త మార్గాన్ని ఎంచుకుంటోంది. ఉత్తరాది కంపెనీలకు ఇక్కడి నుంచి ఆర్డర్లు ఇచ్చి కొరియర్ సంస్థల ద్వారా రప్పించుకుంటోంది. విజయవాడకు శివారున ఉన్న ముస్తాబాద, గన్నవరం, కేసరపల్లిలో కొరియర్ సంస్థలకు చెందిన గోడౌన్లు ఉన్నాయి. ఇక్కడికి వచ్చిన సరుకును మాఫియా కింద పనిచేసే ఏజెంట్లు తీసుకుంటున్నారు. ఇలా పాట్నా నుంచి డీటీడీసీ కొరియర్‌కు వచ్చిన నకిలీ సిగరెట్లను సెంట్రల్ జీఎస్టీ అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ సరుకు మొత్తం విలువ రూ.2.46 కోట్లు ఉంటుందని అంచనా. ఇన్వాయిస్‌లో మాత్రం రూ.8 లక్షలుగా చూపించారు. నకిలీ సిగరెట్లతో పొగప్రియుల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రభుత్వ ఖజానాకు పన్నులు చెల్లించుకుండా కన్నం వేస్తున్నారు. ఈ ఇన్వాయిస్‌లపై మాత్రం బీడీలు అని రాస్తున్నారు. పాట్నాలోని మెసర్స్ గోల్డ్ స్టెప్ టుబాకో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి ఈ నకిలీ సిగరెట్లు వచ్చాయని అధికారులు నిర్ధారించారు. అసలు ఈ ఆర్డర్‌ను ఎవరు బుక్ చేశారు, ఎక్కడి నుంచి బుక్ చేశారు అనే వివరాలు మాత్రం ఇంకా బయటపడలేదు.

దర్యాప్తు ఏమవుతున్నట్టు?

సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు విదేశీ బంగారం, నకిలీ సిగరెట్లను సీజ్ చేసినప్పుడు హడావిడి చేస్తున్నారు. ఆ తర్వాత దర్యాప్తును పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్మగ్లింగ్ సరుకులను పట్టుకున్నప్పుడు ఒక ప్రకటన విడుదల చేస్తున్నారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొంటున్నారు. తర్వాత దర్యాప్తు విషయంలో అడుగు ముందుకు పడడం లేదని తెలుస్తోంది. సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు ఇప్పటి వరకు సీజ్ చేసిన స్మగ్లింగ్ వస్తువుల కేసుల్లో ఇదే జరిగింది. ఇప్పటి వరకు ఫలానా కేసులో అసలు నిందితులను గుర్తించామని, పట్టుకున్నామని ప్రకటించలేదు. ఈ మొత్తం వ్యవహారం ఆయా సంస్థల అధికారుల తీరుపై అనుమానాలకు తావిస్తోంది. సరుకును సీజ్ చేసినా అసలు నిందితులను పట్టుకోవడానికి అధికారులు అడుగులు వేయకపోవడం మాఫియాకు పెద్ద అవకాశంగా మారుతోందనే ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో నకిలీ మాఫియా వేళ్లూనుకుంటోందని తెలుస్తోంది.

పేటలో మళ్లీ డయేరియా కేసులు!

- నేటి నుంచి హోటళ్లు, టీ స్టాళ్లు మూసివేత
- జగ్గయ్యపేటలో హై అలర్ట్

6లో..

జగ్గయ్యపేటలో మళ్లీ డయేరియా!



ఆరోగ్యకేంద్రంలో రోగులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో

- డీఎంహెచ్‌వో సహా జిల్లా అధికారుల సందర్శన
- ఆసుపత్రులకు బాధితులు.. పట్టణంలో హై అలర్ట్
- నేటి నుంచి హోటల్స్, టీ స్టాల్స్ మూసివేత

జగ్గయ్యపేట, జూలై 5 : నియోజకవర్గంలో శుక్రవారం డయేరియా కేసులు తిరిగి పెరగటంతో హైఅలర్ట్ ప్రకటించారు. డయేరియా లక్షణాలతో 10 మంది ఆసుపత్రిలో చేరారు. రోజుల వయసు శిశువుతో పాటు బాలింత ఆసుపత్రికి వచ్చారు. వత్సవాయి మండలం భీమవరానికి చెందిన చిక్కు యామిని (4), షేక్ మస్తాన్ బీ (27), కంభంపాడుకు చెందిన పాశం బెనర్జీ (45), జగ్గయ్యపేట మండలం బూదవాడకు చెందిన బాణావత్ బాల్యా (53), కరిశె రాణి (36)గండ్రాయికి చెందిన పాతుల నరసింహారావు (6), షేర్ మహ్మద్‌పేట గ్రామానికి చెందిన బరిగెల నాగేశ్వరి (25), చిల్లకల్లు గ్రామానికి చెందిన సొంపొంగు నవ్య (22), రోజుల శిశువు, పట్టణంలో తొర్రగుంటపాలేనికి చెందిన జి.కోటేశ్వరి (25)లు ఆసుపత్రిలో చేరారు. చిల్లకల్లు, ముక్త్యాల, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. చిల్లకల్లు గ్రామంలో వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో సుహాసిని, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నియంత్రణాధికారి జె.ఉషారాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అమృత, డీడీఎంహెచ్‌వో ఇందుమతి, సామాజిక ఆరోగ్య కేంద్ర సూపరింటెండెంట్ హరీశ్ తదితరులు సందర్శించారు.

మదర్సాలో బాలికల అస్వస్థతపై విచారణ



మదర్సాలో విచారిస్తున్న ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యులు

కృష్ణలంక, జూలై 5 : ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జంగం రాజేంద్రప్రసాద్ శుక్రవారం సింగ్ నగర్‌లోని మదర్సా ఇన్‌స్టిట్యూట్‌ను విచారణ నిమిత్తం సందర్శించారు. ఇటీవల బాలిక మృతిపై విచారణ నిమిత్తం మదర్సాకు వచ్చారు. విచారణలో మదర్సాలో 10 మంది బాలికలు అస్వస్థతకు గురైనట్టు, వారిలో కరిష్మా అనే బాలిక మృతిచెందినట్టు ఆయన గుర్తించారు. ఈ సందర్భంగా మదర్సా సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. ఆడపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎప్పటికప్పుడు వైద్యులతో హెల్త్ చెకప్ చేయించాలని తెలిపారు. ఆహార పదార్థాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పరిసర ప్రాంతాలు శుభ్రంగా వుంచాలని ఆయన తెలిపారు. అనంతరం ఎంకే బేగ్ స్కూల్‌ను సందర్శించి పిల్లలకు ఇచ్చే ఆహారాన్ని ఆయన పరిశీలించారు. అక్కడి సిబ్బందికి, విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జె.రాజేంద్రప్రసాద్, నాగమణి, లక్ష్మీప్రసన్న, రాజేశ్వరరావు, జాన్సన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను ఆదుకోండి

- మంత్రి అచ్చెన్నకు టీడీపీ నేతల వినతి



జి.కొండూరు, జూలై 5 : రాష్ట్ర ఆదాయంలో రైతుదే అగ్రభాగమని అలాంటి రైతును వైసీపీ ఐదేళ్ల పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని.. కూటమి పాలనలో మరల రైతును రాజు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడ్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు జంపాల సీతారామయ్య, కె.విజయబాబులు కోరారు. శుక్రవారం అమరావతిలో మంత్రిని కలిసి రైతుల సమస్యలు, అవసరాలను వినతిపత్రం ద్వారా వివరించారు. ఉద్యాన రైతుల్ని ఆదుకునేందుకు పంటల బీమా తీసుకురావాలని, వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన బిందు, తుంపర్ల సేద్యం రాయితీని తిరిగి పునరుద్ధరించి ఎస్సీ, ఎస్టీలకు 90శాతం రాయతీ ఇవ్వాలని కోరారు. మైలవరం నియోజకవర్గంలో మామిడి ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేసి ఒరుగులు, తాండ్ర, పచ్చళ్ల తయారు చేసుకునే అవకాశం కల్పిస్తే రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. తాడేపల్లిగూడెంలో ఉన్న ఉద్యానపరిశోధన కేంద్రం రీసెర్చ్ స్కాలర్స్‌చే ఈప్రాంత ఉద్యాన పంటలపై పరిశోధన చేయించి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. మైలవరం మార్కెట్ యార్డ్‌లో త్వరలో ఒక సదస్సు ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి పరిశీలిస్తానని హామి ఇచ్చినట్టు వారు తెలిపారు. ముందుగా మంత్రిని నేతలు దుశ్శాలువా, పూలబొకేతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉయ్యూరు వెంకటనరసింహారావు, సీహెచ్.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు, కేశినేని చిన్నిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

ఔటర్ రింగ్, ఫ్లైఓవర్‌లకు అనుమతులపై హర్షం

- చంద్రబాబు, ఎంపీ చిన్ని చిత్రపటాలకు క్షీరాభిషేకం

విద్యాధరపురం, జూలై 5 : ఔటర్ రింగ్ రోడ్డు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నిడమానూరు వరకు ఫ్లైఓవర్ నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొందినందుకు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు సీఎం చంద్రబాబు, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ల చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నరసింహచౌదరి, టీడీపీ రాష్ట్ర నేత మాదిగాని గురునాథంలు మాట్లాడుతూ, బాధ్యతలు చేపట్టి నెలరోజులు కాకముందే కేంద్రం నుంచి ఔటర్ రింగ్, ఫ్లైఓవర్‌లకు అనుమతులు తీసుకురావడం హర్షణీయమన్నారు. సీఎం చంద్రబాబు, కేశినేని చిన్నిలు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడి గ్రీన్ సిగ్నల్ ఇప్పించారన్నారు. వీటి పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపై విజయవాడలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతాయని, స్వర్ణయుగ నిర్మాత చంద్రబాబు నాయకత్వంపై ప్రజలు నమ్మకంతో ఎన్నికల్లో చారిత్రక తీర్పు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, ఎస్.ఫిరోజ్, సోలంకి రాజుజైన్, గొల్లపూడి నాగేశ్వరరావు, కత్తుల మణికంత తదితరులు పాల్గొన్నారు.

నేడు జూనోసిస్ డే ..



కృష్ణలంక, జూలై 5 : పెంపుడు కుక్కలు చూసేందుకు ఎంత అందంగా కనబడతాయో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వాటితో పాటు మనుషులకు తీవ్ర ప్రమాదమే. కుక్కపిల్లల పెంపకం నేడు నిత్య జీవితంలో ఒక భాగంగా మారింది. అదే నేపథ్యంలో వాటి పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిశుభ్రత, సంరక్షణ విషయాల్లో అప్రమత్తంగా వుండకపోతే ప్రమాదాన్ని కోరి తెచ్చుకున్నట్టే. పశువుల నుంచి మనుషులకు సోకే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కలగజేసి వ్యాధులను అరికట్టి వారిని చైతన్యపరచడమే 'జూనోసిస్ డే' ప్రధాన ఉద్దేశ్యం. ర్యాబిస్ వ్యాధికి మందులేక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్న సమయంలో 'లూయిస్ పాశ్చర్' అనే శాస్త్రవేత్త 'యాంటీ రేబిస్' వ్యాక్సిన్‌ను కనుగొని ప్రపంచానికి మహోపకారం చేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం జూలై 6వ తేదీన ప్రపంచవ్యాప్తంగా 'జూనోసిస్ డే' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు

జూనోసిస్ డే సందర్భంగా జూలై 6వ తేదీ అన్ని ప్రభుత్వ పశువుల ఆస్పత్రులలో కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు తెలిపారు. పశుపోషకులకు, పెంపుడుకుక్కల యజమానులకు, పశువుల నుంచి, కుక్కల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై అవగాహనా శిబిరం ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని శ్రీనివాసరావు తెలిపారు. ఈ అవకాశాన్ని పెంపుడు జంతువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మునేటిలో అనుమానాస్పద మృతి

- మృతుడు ప్రకాశం జిల్లా వాసిగా గుర్తింపు



పెనుగంచిప్రోలు, జూలై 5 : ప్రకాశం జిల్లా చినగంజాం మండలం కడవకుదురు గ్రామానికి చెందిన కంపిరి అనిల్ నాయుడు పెనుగంచిప్రోలు మునేటి కాజ్‌వే వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయాన్ని పోలీసులు శుక్రవారం సాయంత్రం గుర్తించారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. కాజ్‌వే సమీపంలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ పి.రాంబాబు సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడు అనిల్‌గా గుర్తించారు. సంఘటనా స్థలాన్ని జగ్గయ్యపేట సీఐ ఎం.జానకి రామ్ సందర్శించి వివరాలను సేకరించారు. పోస్టుమార్టం అనంతరం జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు.

నీరులేక ఎండుతున్న వరి చేలు

పెడన రూరల్ : ఖరీఫ్ సాగు మొదలైంది. మండలంలో 24 వేల ఎకరాలలో సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే 40 శాతం మంది రైతులు విత్తనాలు వెదజల్లారు. కాలువలు వస్తాయని ఎదురు చూశారు. రైతులు వర్షంకోసం ఎదురుచూస్తున్నారు. ఎకరాకు ఏడెనిమిది వేలు ఖర్చయిందంటున్నారు. పెడన, బల్లిపర్రు, మడక, శింగరాయపాలెం, కాకర్లమూడి, కోటావానిపాలెం, జింజేరు, అచ్చయ్యవారిపాలెం, దేవరపల్లి గ్రామాల్లో నీరులేక వెదజల్లిన వరిచేలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు మూడు రోజుల్లో వర్షం కురియకపోతే వరి చచ్చి పోతుందని, మళ్లీ దుక్కిదున్ని విత్తనాలు జల్లాలంటే అదనపు ఖర్చు భరించేస్థితిలో లేమని రైతులు వాపోతున్నారు.

వెదజల్లిన వరిచేను



తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టండి

- కాలనీల్లో కృష్ణా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
- నీరు రంగుమారి వస్తోందని కలెక్టర్‌కు సుల్తానగర్ వాసుల ఫిర్యాదు



సుల్తానగరంలోని తాగునీటి సరఫరాపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, జూలై 5 : తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. బందరు మండలం సుల్తానగరంలో తాగునీటి సరఫరాపై కలెక్టర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక ప్రజలను నీటి సరఫరాపై ఆరా తీసారు. ఆ సందర్భంగా వాటర్ ట్యాంకును పరిశీలించారు. తాగునీరు ఎలా ఉంటోందని ఆరా తీసారు. నీరు ఆకుపచ్చగా వస్తోందని చిట్టిబొమ్మ దుర్గాప్రసాద్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నీటిని ల్యాబ్ టెస్ట్‌కు పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వాటర్ రిజర్వాయర్లను శుభ్రం చేయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అతిసార వంటి వ్యాధులు రాకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రయత్నించాలని పంచాయతీ అధికారుకు సూచించారు. పాడైన పైప్‌లైన్ లీకులను గుర్తించి అరికట్టాలన్నారు. మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించి ఫోటోలు పంపాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్‌ను ఆదేశించారు.

తరకటూరు సమ్మర్ స్టోరేజీ పరిశీలన

పట్టిసీమ జలాలు విడుదలైన సందర్భంగా బందరు ప్రజలకు తాగునీరందించేందుకు కలెక్టర్ ముందస్తు ప్రణాళిక రూపొందిస్తున్నారు. మంత్రి రవీంద్ర సూచనల మేరకు జిల్లాలోని వివిధ గ్రామాలతో పాటు పట్టణ ప్రజల అవసరాలకు కావలసిన నీటిని నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం తరకటూరు సమ్మర్ స్టోరేజిని పరిశీలించారు. నేరుగా కలెక్టర్ తరకటూరు సమ్మర్ స్టోరేజికి వెళ్లి ప్రస్తుత నీటి మట్టం 1.9 మీటర్లు ఉన్నట్టు గుర్తించారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. ఇంకా 12 రోజుల వరకు తాగునీటి నిల్వలు ఉండగా.. మరో రెండు వారాల్లో పట్టిసీమ నీరు బందరు రానున్న దృష్ట్యా ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత కల్పించనున్నారు. పట్టిసీమ జలాలు వచ్చేలోగా తాగునీటి రిజర్వాయర్లు శుభ్రం చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశాలు జారీచేశారు. తరకటూరు సమ్మర్ స్టోరేజిని మోటార్లతో నింపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డబ్లుఎస్ అధికారులు ఉన్నారు.

కలుషితం కాకుండా చర్యలు తీసుకోండి..

పామర్రు : ప్రజలకు తాగునీరు అందించడంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. బల్లిపర్రు, కనుమూరు గ్రామాల్లో శుక్రవారం మండలస్థాయి అధికారులతో కలిసి గ్రామాల్లో రక్షిత నీటి సరఫరాపై ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అందుతున్న నీటి సరఫరాపై వివరాలు అడిగితెలుసుకున్నారు. ప్రస్తుత సీజన్లో గ్రామాల్లో మంచినీటి పథకాల్లో తప్పని సరిగా క్లోరినేషన్ చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే గ్రామస్థాయి అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, డీపీవో నాగేశ్వర్‌నాయక్, ఉయ్యూరు ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ శ్రీపల్లవి తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ వేగవంతం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : బందరుపోర్టు వరకు రోడ్‌కం రైలు మార్గాల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోర్టుకు కనెక్టివిటీ కోసం రోడ్‌కం రైలు మార్గం కీలకమైనదన్నారు. దీనికోసం అవసరమైన భూసేకరణను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. భూసేకరణలో న్యాయపరమైన చిక్కులు ఎదురు కాకుండా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూములు ఇచ్చిన రైతులకు సకాలంలో పరిహారం అందించాలన్నారు. జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో ఎం.వాణి, ఏపీ మేరీటైమ్‌బోర్డు డెప్యూటీ కలెక్టర్ వెంకట్రావ్, మెరైన్ విభాగం డీఈ శివయ్య, మచిలీపట్నం తహసీల్దార్ వెంకటేశ్వరరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 25 పరీక్షా కేంద్రాలు.. హాజరుకానున్న 7,834 మంది అభ్యర్థులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

విజయవాడ లీగల్, జూలై 5 : ఈనెల 7వ తేదీ ఆదివారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించనున్న ఈపీఎఫ్ఓ-పర్సనల్ అసిస్టెంట్, ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో యూపీఎస్సీ పరిశీలకులు అశోక్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావులతో కలిసి లైజన్ కమ్ రూట్ ఆఫీసర్లు, పరీక్షా కేంద్రాల సూపర్‌వైజర్లు, సహాయ సూపర్‌వైజర్లు తదితరులతో సమావేశం నిర్వహించారు. పరీక్ష నిర్వహణకు పూర్తిస్థాయిలో చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విజయవాడలో తొమ్మిది కేంద్రాల్లో ఈపీఎఫ్‌వో, 16 కేంద్రాల్లో ఈఎస్ఐసీ పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈపీఎఫ్‌వో పరీక్షకు 2,401, ఈఎస్ఐసీ పరీక్షకు 5,433 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు చెప్పారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు ఈపీఎఫ్ఓ-పర్సనల్ అసిస్టెంట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష నిర్వహణకు 25 మంది లైజన్ కమ్ రూట్ అధికారులు, 25 మంది సూపర్‌వైజర్లు, 25 మంది సహాయ సూపర్‌వైజర్లు పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరం మేరకు పటిష్ట బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖను, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేలా ఆయా రూట్లలో అదనపు బస్సులను నడపాలని ప్రజా రవాణా అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ టీవీల నిఘాకు, 144 సెక్షన్ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని, తాగునీరు అందుబాటులో వుంచడం, మరుగుదొడ్లు వంటి ఏర్పాట్లు ముఖ్యమన్నారు. సమావేశంలో కలెక్టరేట్, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ఆర్టీసీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అత్యంత పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

కృష్ణలంక : ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో కార్డుదారులకు సకాలంలో సరుకులు అందేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని, ఎక్కడా రేషన్ బియ్యం దారిమళ్లకుండా గట్టి నిఘా వుంచాలని కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. సీజన్ల వారీగా ధాన్యం సేకరణ, మిల్లింగ్, ఎండీయూల ద్వారా సరుకుల పంపిణీ, రేషన్ బియ్యం దారిమళ్లకుండా నిఘా, కేసుల నమోదు, విచారణ తదితరాలపై చర్చించారు. జిల్లాలో సుమారుగా ఆరు లక్షల కార్డులున్నాయని, ప్రతినెలా 374 ఎండీయూల ద్వారా లబ్ధిదారులకు సరుకులు అందజేస్తున్నట్టు వివరించారు. ఖరీఫ్-2024 ధాన్యం సేకరణకు సంబంధించి ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని సిద్ధంగా వుండాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు అదుపులో వుండేలా సమన్వయ శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, డీఎస్‌వో జి.మోహన్ బాబు పాల్గొన్నారు.

ఆశీలు ఘనం.. వసతులు శూన్యం!

- సమస్యల వలయంలో నాగాయలంక వారపు సంత మార్కెట్
- ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులు



నాగాయలంక మార్కెట్‌లో శిథిల స్థితిలో షెడ్ పిల్లరు, అధ్వానంగా మరుగుదొడ్డి



నాగాయలంక : నాగాయలంక మార్కెట్‌లో ప్రతీ శని, ఆదివారాలు ఎండు చేపలు, కూరగాయలు అమ్ముకునే వారపు సంతలో మౌలిక సదుపాయాలు లేక వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాకాలంలో వ్యాపారులు ఎండు చేపలు, కూరగాయలు తడవకుండా ఉండేందుకు రక్షణగా 1996లో అప్పటి ఎంపీ టి.శారద ఎంపీ నిధుల నుంచి రూ.1.50 లక్షలు మంజూరు చేయగా, మార్కెట్ ప్రాంగణంలో సిమెంట్ రేకులతో రెండు షెడ్లను, ప్లాట్ ఫారాలను నిర్మించారు. కాలక్రమేణా అందులో ఒక షెడ్‌కి ఉన్న సిమెంట్ పిల్లర్లు పూర్తిగా విరిగి పోయి ప్రమాదానికి అంచున ఉంది. వర్షం వస్తే వ్యాపారులు తమ సరుకులను దాచుకోవటానికి తగిన భద్రత లేకపోవటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సంత మార్కెట్‌లో ఉన్న టాయిలెట్లు శిథిలమవటంతో చేపలు అమ్ముకునే మత్స్యకార మహిళలకు తగిన మరుగు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి సౌకర్యం కూడా పంచాయతీ అధికారులు కల్పించకపోవటంతో వ్యాపారులు వారిపై మండిపడుతున్నారు.

2024-25వ ఆర్థిక సంవత్సరంలో వారపు సంత ఆశీలు పాటను రూ.7.30 లక్షలకు పాటదారుడు పాడుకోగా, ఏడాదికి 52 వారాల్లో ఒక్కొక్క వారానికి సుమారు 14 వేలకుపైగా పంచాయతీకి ఆదాయం వస్తున్నది. వారపు సంత నుంచి గణనీయంగా ఆదాయం వస్తున్నా, సంతకు వచ్చే వ్యాపారులకు తగిన వసతులను పంచాయతీ అధికారులు కల్పించటం లేదని వ్యాపారులు విమర్శిస్తున్నారు. అలాగే పాటదారుడు నిర్ణీత ధరల కన్నా చిరు వ్యాపారులు నుంచి ఎక్కువగా వసూలు చేస్తున్నా అధికారులు, పాలకులు మౌనంగా ఉండటంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. సంత మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి, చిరు వ్యాపారుల నుంచి ఎక్కువగా ఆశీలు వసూళ్లను నియంత్రించాలని పంచాయతీ అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జె.పవన్ కుమార్‌ను వివరణ కోరగా, టాయిలెట్లను బాగు చేయిస్తామన్నారు. పాడైన షెడ్డును తిరిగి నిర్మించేందుకు పంచాయతీ రాజ్ ఏఈతో అంచనాలు వేయిస్తామని, సంతలో మంచినీటి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత పాటదారుడిదేనని తెలిపారు. చిరు వ్యాపారుల వద్ద అధిక ఆశీలు వసూళ్లు చేస్తున్నట్టు తమకు ఫిర్యాదు వస్తే తగిన చర్యలు తీసుకుంటామని కార్యదర్శి తెలిపారు.



నున్న స్టేషన్‌లో ఉమను పరామర్శిస్తున్న గ్రామస్థులు

వివాహిత న్యాయ పోరాటానికి గ్రామస్థుల మద్దతు

- భర్త, అత్త, మామ సహా ఆరుగురిపై కేసు

విజయవాడ రూరల్, జూలై 5 : అత్త, మామ ఇంట్లోకి రానివ్వడం లేదని అత్తింటి ముందు వివాహిత చేసిన న్యాయపోరాటంపై శుక్రవారం పోలీసులతో పాటు గ్రామస్థులు స్పందించారు. వివాహితకు మద్దతుగా నున్న రూరల్ స్టేషన్‌కు చేరుకున్నారు. వివాహిత ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఆమె భర్త, అత్త, మామతో పాటు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. నున్న గ్రామం కుమ్మరిబజారుకు చెందిన యనగంటి ఉమ భర్త భార్గవ్ ఆమెను వదిలేసి వెళ్లిపోవడం, అత్త, మామలు కనీసం ఇంట్లోకి రానివ్వకపోవడంతో ఆమె న్యాయపోరాటానికి దిగింది. నాలుగునెలల గర్భిణిగా ఉండి కూడా నాలుగేళ్ల కొడుకుతో అత్తింటి ముందు దీక్ష చేపట్టిన కథనం శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'న్యాయపోరాటం' పేరుతో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గ్రామ టీడీపీ, వైసీపీ నేతలు, గ్రామస్థులు వివాహితకు మద్దతుగా నిలిచారు. నున్న రూరల్ పోలీసులు గ్రామానికి చేరుకుని ఆమె నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. అనంతరం భర్త, అత్త, మామతో పాటు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివాహిత భర్త ఆమెను వదిలేసి కనిపించకుండా తిరుగుతుండటంపై కూడా పోలీసులు దృష్టి పెట్టారు. భర్తను తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది మహిళకు సంఘీభావంగా నున్న రూరల్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. సబంధిత శాఖ వన్‌స్టాప్ పారా లీగల్ డి. సౌజన్య కేసు వర్కర్ ఎస్.ఆశాలతాజ్యోతి వివాహితతో మాట్లాడి ఆశ్రయం కల్పిస్తామని కోరగా ఆమె నిరాకరించింది. నున్నలోని భర్త, బంధువుల ఇంటి వద్దనే ఉంటానని కోరడంతో ఆమెను అక్కడికి పంపించారు.

వివాహిత ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, జూలై 5 : కుటుంబ కలహాలతో వివాహిత ఇబ్రహీంపట్నం ఫెర్రీలో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడిన వైనమిది. పోలీసుల కథనం ప్రకారం.. గుడివాడ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కట్ట గణేశ్ కొన్నేళ్ల క్రితం ఇబ్రహీపట్నం వచ్చి నివాసం ఉంటున్నాడు. ఇటీవల ద్విచక్ర వాహనం కొనుక్కునే నిమిత్తం అతను బ్యాంకులో రూ.45 వేలు దాచుకున్నాడు. అవి తీసుకునేందుకు బ్యాంకు వెళ్లగా బ్యాంకుఖాతాలో కేవలం రూ.12 వేలు మాత్రమే ఉన్నాయి. ఈవిషయంపై అతను భార్య ప్రశాంతి (25)ని ప్రశ్నించాడు. దానికి సమాధానం చెప్పలేక భర్త బయటకు వెళ్లిన సమయంలో ఇంటి పై కప్పులో ఉన్న రాడ్డుకి చున్నితో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వారికి మూడేళ్ల పాప ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో చేరేందుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం పొందేందుకు 10+2 విద్యార్హతతో పాటు, మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లమో కోర్సు చదివినవారు అర్హులని తెలిపారు. ఈనెల 8వతేదీ నుంచి 28వతేదీవరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రాతపరీక్షతోపాటు అడాప్టబిలిటీ 1, 2దశల్లో ఫిట్‌నెస్ పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

జలవనరుల శాఖలో ఖాళీలు భర్తీ చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 5 : రైతులకు సకాలంలో సాగు నీరందించే విధంగా కాలువల నీటి యాజమాన్యం సక్రమంగా జరిగేందుకు జలవనరుల శాఖలోని ఖాళీలను త్వరిత గతిన భర్తీ చేయాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకు సాగునీటి సంఘాల అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. జలవనరు లశాఖ పేషీలో మంత్రిని శుక్రవారం కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రధాన సాగునీటి కాలువల్లో తూటుకాడ లాంటి చెత్తను తొలగించేలా షార్ట్ టెండర్లను పిలిచి పనులు అప్పజెప్పడం రైతులకు మేలు చేస్తుందన్నారు. క్షేత్ర స్థాయిలో పనులు త్వరితగతిన జరిగేలా పరిశీలించేందుకు జలవనరులశాఖలోని లస్కర్ పోస్టులను భర్తీ చేయాలని కోరినట్లు ఆళ్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర పాల్గొన్నారు.

నేడు యనమలకుదురులో ఆరోగ్య కేంద్రం ప్రారంభం

పెనమలూరు, జూలై 5 : తాడిగడప మునిసిపాలిటీ యనమలకుదురులో నేడు నూతన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హాజరుకానున్నారు.

నేటినుంచి వారాహి నవరాత్రులు

గన్నవరం(ఉంగుటూరు), జూలై 5 : గన్నవరం శ్రీలక్ష్మీ తిరుపతమ్మతల్లి ఆలయంలో ఈ నెల 6వ తేదీ శనివారం సాయంత్రం వారాహిదేవి నవరాత్రులు ప్రారంభమౌతాయని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నవరాత్రుల సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఆషాఢ శుద్ధ పాడ్యమినుంచి ఆషాఢ శుద్ధ దశమి (ఈనెల 15వ తేదీ సోమవారం) వరకు ప్రతిరోజూ సాయంత్రం లలిత సహస్రనామ పారాయణం, వారాహి అష్టోత్తర నామార్చన, ప్రత్యేక పూజలు జరుగుతాయని, ఈ నెల 7న తొలి ఆషాఢ ఆదివారం కావడంతో ఆరోజున భక్తులందరిచే అమ్మవారికి ఆషాఢం సారెతోపాటు, అంకమ్మతల్లికి తొలి బోనం సమర్పించనున్నట్లు తెలిపారు.

మందుల షాపులో తనిఖీ

ఉయ్యూరు, జూలై 5 : ఉయ్యూరులో వెంకటేశ్వర థియేటర్ సమీపంలోని శ్రీకృష్ణా మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్‌లో జిల్లా ఇన్‌చార్జ్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామమూర్తి శుక్రవారం తనిఖీ చేశారు. మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్‌లో మందుల నిల్వలు, వాటికి సంబంధించి బిల్లులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిస్ట్రిబ్యూటర్స్‌లో రికార్డులకు సంబంధించి కొన్ని లోపాలు గుర్తించామని, మందుల నిల్వలకు సంబంధించి పరిశీలనలో తేలాల్సి ఉందని, లోపాలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా సాధారణ తనిఖీకి వచ్చినట్లు తెలిపిన ఆయన పట్టణ పరిధిలో షాపులను తనిఖీ చేయకుండా వెళ్లడం, కొందరు మందుల షాపుల యజమానులు ఆయన్ను కలవడం పలు విమర్శలకు తావిస్తుంది.

వైసీపీ నాయకులు అక్రమంగా వసూలు చేసిన సొమ్ము ఇప్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వణుకూరు రైతులు

వణుకూరు (కంకిపాడు), జూలై 5 : జగనన్న కాలనీ కోసం సేకరించిన భూమిలో మా వద్ద నుంచి అక్రమంగా వసూలు చేసిన డబ్బులు ఇప్పించాలని వణుకూరు రైతులు శుక్రవారం పెనమలూరు తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ కోసం వణుకూరులో సుమారు 400 ఎకరాలను రైతుల నుంచి అధికారులు సేకరించారని, ఒక్కో ఎకరం రూ. 75 లక్షల చొప్పున నిర్ణయించారని, ప్రభుత్వం నుంచి రైతుల ఖాతాల్లో రూ. 75 లక్షలు జమయ్యాయని, అయితే తమ అకౌంట్‌లో జమ అయిన సొమ్ము నుంచి వైసీపీ నాయకులు రూ. 6 లక్షల చొప్పున అక్రమంగా వసూలు చేశారని, తమ వద్ద నుంచి వసూలు చేసిన సొమ్ము తమకు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పరిశుభ్రతకు సహకరించాలి



వీరవల్లి కుమ్మర కాలనీలో తొలగిస్తున్న చెత్త

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 5 : వర్షాకాలంలో దోమల వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఇంటి చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రతకు గ్రామస్తులు కూడా సహకరించాలని సర్పంచ్ పిల్లా అనిత సూచించారు. వీరవల్లి కుమ్మర కాలనీ, రైల్వేగేటు సమీపంలోని పిచ్చిమొక్కలను, రహదారి ప్రక్కన పేరుకు పోయిన చెత్తను యంత్రాల సహకారంతో పారిశుధ్య కార్మికులు తొలిగించే కార్యక్రమాన్ని శుక్రవారం మొదలు పెట్టారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి శ్యామలరావు, పాలకవర్గ సభ్యుడు పిల్లా రామారావు, తదితరులు పర్యవేక్షించారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నేతలు

ఉయ్యూరు, జూలై 5 : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి, చంద్రబాబు ముఖ్యమంత్రిగా, పెనమలూరు ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్ ఎన్నికవడం పట్ల ఉయ్యూరుకు చెందిన తెలుగు యువత నాయకులు తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామిని అలిపిరి మెట్లమార్గం నుంచి కాలినడకన వెళ్లి మొక్కుతీర్చుకున్నారు. టీడీపీ 17వ వార్డు ఇన్‌చార్జ్ రాజులపాటి వెంకట్, పట్టణ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు జంపాన తేజ, జంపాన ధనుశ్ స్వామివారికి మొక్కు చెల్లించుకున్నవారిలో ఉన్నారు.



మొక్కు తీర్చుకునేందుకు తిరుమలకు కాలినడకన వెళ్తున్న టీడీపీ యువనాయకులు

అందరికీ విద్య ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



డ్రాప్ అవుట్స్‌పై విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం(ఉంగుటూరు), జూలై 5 : అందరికీ విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తోందని, బడి ఈడు పిల్లలందరూ బడిలోనే వుండాలని, వివిధ కారణాలతో బడిమానేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించి ఉచిత నిర్బంధ విద్యను అమలు చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విద్యాశాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల విద్యాశాఖ అధికారులు, జడ్పీహైస్కూళ్ల హెచ్ఎంలతో కలిసి గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్‌ఔట్ల సంఖ్య తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, ఉపాధ్యాయులకు దిశా-నిర్దేశం చేశారు. విద్య ప్రాముఖ్యత, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను తల్లిదండ్రులకు వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవారి సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ముఖ్యంగా 6నుంచి 14ఏళ్ల వయసుగల బాలలంతా పాఠశాలల్లో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవోనెం.117ను రద్దుచేయాలని విద్యాశాఖాధికారులు కోరగా ఆ విషయాన్ని విద్యాశాఖామంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని యార్లగడ్డ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డీవైఈవో పద్మరాణి, ఎంపీడీవో సత్యకుమార్, తహసీల్దార్ ఎస్.ఎస్.పవన్‌కుమార్, నాలుగు మండలాల విద్యాశాఖాధికారులు, జడ్పీహైస్కూల్స్ హెచ్ఎంలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఉంగుటూరు : ప్రభుత్వాసుపత్రుల్లో ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ (ఏపీఎన్ఎస్‌సీ)స్టేట్ కో-ఆర్డినేటర్ బొకినాల సౌమ్యరేఖ ఆధ్వర్యంలో శుక్రవారం గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న దాదాపు 11,500మంది స్టాఫ్‌నర్సులందరినీ రెగ్యులర్ చేయాలని, సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, పీహెచ్‌సీల్లో ఐదుగురు స్టాఫ్ నర్సులను నియమించాలని, కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులకు 50లక్షల బీమా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, పరస్పర అంగీకారబదిలీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి గత వైసీపీ ప్రభుత్వం మమ్మల్ని నిలువునా మోసం చేసిందన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆరోగ్యశాఖా మంత్రితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్‌లు ఆదిలక్ష్మి, శ్రీదివ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



గంగూరులో మొక్కను నాటుతున్న బోడె ప్రసాద్, కిలారు దిలీప్

పెనమలూరు, జూలై 5 : ప్రతి ఒక్కరూ అమ్మకోసం మొక్కలునాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, బీజేపీ సీనియర్ నాయకులు కిలారు దిలీప్ పిలుపునిచ్చారు. శుక్రవారం గంగూరులోని జానకి రామయ్య ఎస్టేట్స్ ఆవరణలో కిలారు దిలీప్ ఆధ్వర్యంలో జరిగిన అమ్మకోసం ఒక చెట్టు కార్యక్రమంలో వారు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తల్లిని పూజించినట్లే మొక్కను కూడా పూజించాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఆస్తులు, విజ్ఞానం కన్నా ప్రకృతి గొప్పదని, వాతావరణంలో వస్తున్న మార్పులను పరిగణనలోకి తీసుకొని ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం వహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, నాయకులు శ్రీనివాస రాజు, మాజీ డీఐజీ కేశవనాయుడు, యాస్మిన్, పాతూరి నాగభూషణం, అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, సంగెపు రంగారావు, అబ్దుల్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్ నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

తాగునీరు కలుషితం కారాదు: కలెక్టర్

ఉయ్యూరు, జూలై 5 : తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ నగర పంచాయతీ కమిషనర్‌ను ఆదేశించారు. ఉయ్యూరులో గాంధీ సదన్ సమీపాన నగర పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకులో నీటిని శుక్రవారం పరిశీలించారు. ట్యాంకు శుభ్రం చేసిన తేదీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో అతిసార వంటి వ్యాధులు ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్డీవో డి.రాజు, నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దూరం



వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో అతిసారపై బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్యబృందం

గన్నవరం(ఉంగుటూరు), జూలై 5 : వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులకు దూరంగా వుండవచ్చునని జలజీవన్ మిషన్ ప్రోగ్రామ్ సమన్వయకర్తలు ఎం.సుగుణరావు, బి.శ్రీధర్ తెలియజేశారు. అతిసార నిర్మూలన కార్యక్రమంలో భాగంగా, జిల్లా జలజీవన్ మిషన్ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కేసరపల్లి జడ్పీహైస్కూల్‌లో అతిసార లక్షణాలు, నిర్మూలన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీమౌనిక, డాక్టర్ టి.సృజన, హెల్త్‌సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు, ఎం.ఎల్.హెచ్.పీ కే.తేజశ్రీ, ఏఎన్ఎం కె.నాగమణి, టీచర్లు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అతిసార ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని, ముఖ్యంగా అతిసార రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆత్కూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.మనోహర్‌రెడ్డి అన్నారు. వీరపనేనిగూడెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆత్కూరు పీహెచ్‌ఈ వైద్యఆరోగ్య బృందం సందర్శించింది. ఈ సందర్భంగా అతిసార బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో సీహెచ్ సాంబశివరాజు, పీహెచ్ఎన్ బీవీవీ కుమారి, హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి, సీహెచ్‌వో పి.శ్యామల, ఏఎన్ఎం, పి.అనిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వ్యాపార సౌలభ్యానికి క్లౌడ్ కంప్యూటింగ్ దోహదం

ఉంగుటూరు, జూలై 5 : వ్యాపారానికి మరింత సౌలభ్యాన్ని ఇవ్వటంతోపాటు, కొత్త అప్లికేషన్ల రూపకల్పన ప్రక్రియను సులభతరం చేసి, నూతన ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడంలో క్లౌడ్ కంప్యూటింగ్ ఎంతో దోహదపడుతుందని ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి, క్లౌడ్ కంప్యూటింగ్ నిపుణుడు సీహెచ్. గోపిరాజు అన్నారు. మండలంలోని తేలప్రోలు ఉషా రామా ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)సహకారంతో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫైనలియర్ విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్ విత్ అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై ఐదురోజుల వర్క్‌షాప్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. వర్క్‌షాపును ప్రారంభించిన ఐటీ విభాగాధిపతి ప్రొఫెసర్ యనమదల వరప్రసాద్ మాట్లాడుతూ, క్లౌడ్ కంప్యూటింగ్ విత్ ఏడబ్ల్యుఎస్ నేర్చుకోవడం వలన కంపెనీలకు వర్చువలైజేషన్, ఆన్ డిమాండ్ వనరులను ఉపయోగించుకోవడంలో తోడ్పాటునందిస్తుందన్నారు. కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, డీన్ సీహెచ్ శాంతిరాణి, ఆర్ అండ్ డీ డీన్ జి.సాగర్, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ త్రివిక్రమరావు, అధ్యాపకులు వర్క్‌షాపును సందర్శించి విద్యార్థులను అభినందించారు.

స్తంభాన్ని ఢీకొన్న బైక్ - ఒకరికి తీవ్రగాయాలు

గన్నవరం(ఉంగుటూరు), జూలై 5 : గతుకుల రోడ్డులో బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి పక్కనున్న స్తంభానికి ఢీకొని పంటబోదెలో పల్టీకొట్టిన ఘటనలో గుర్తుతెలియని యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన గన్నవరం మండలం సావారిగూడెం సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కేసరపల్లికి చెందిన యువకుడు సాయంత్రం బైక్‌పై సావారిగూడెం వైపు వెళ్తున్నాడు. ఆ సమయంలో వర్షం పడడంతో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను తప్పించుకుంటూ వెళ్లే క్రమంలో బైక్ అదుపుతప్పి పక్కనున్న స్తంభానికి ఢీకొట్టి పంటబోదెలో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడి తలకు తీవ్రగాయమైంది. గాయపడ్డ యువకుడి పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

నాసా స్పేస్ కాంపిటేషన్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ఉయ్యూరు, జూలై 5 : జాతీయస్థాయిలో జరిగిన నాసాస్పేస్ కాంపిటేషన్‌లో ఉయ్యూరు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలు చరణ్‌తేజ్, హర్త్రినాథ్, స్వరణ్‌తేజ్, హితేశ్ శ్రావణి, సోఫియా, హిమవర్షిత్, జయశ్రీ, దుర్గా సాయిప్రసాద్ బృందాన్ని ప్రిన్సిపాల్ ఆర్‌వి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో తృతీయస్థానం సాధించడం గర్వకారణమన్నారు. ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ ధీరేంద్ర, ఎకడమిక్ కో-ఆర్డినేటర్ భానుప్రకాశ్, అశోక్, డీన్ శివకుమార్ తదితరులు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు



కానూరు పంటకాల్వ రోడ్డులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక డ్రైవ్

తాడిగడప మునిసిపల్ కమిషనర్

పెనమలూరు, జూలై 5 : తాడిగడప మునిసిపాలిటీలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని కమిషనర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నాయకులు దోనేపూడి రవికిరణ్, అంగి రేకుల మురళిల ఆధ్వర్యంలో తన సిబ్బందిని తీసుకుని వెళ్లి పంట కాల్వ రోడ్డులో పారిశుధ్య పనులను ఆయన స్వీయ పర్యవేక్షణలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, స్థానిక నాయకులు, ప్రజలు సూచించిన విధంగా పారిశుధ్య పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పారిశుధ్య పనులను శాశ్వత ప్రాతిపదికన చేపడుతున్నామని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

ఎన్‌ఆర్‌ఐ రంగనాథ్‌బాబుకు మండలి సత్కారం



ఘంటసాల : విద్యా వ్యాప్తికి ఎన్‌ఆర్‌ఐ రంగనాథ్‌బాబు ఎనలేని సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. ఘంటసాలలోని స్వగృహం వద్ద ఎన్‌ఆర్‌ఐ రంగనాథ్‌బాబును ఆయన ఘనంగా సత్కరించారు. శయన బుద్ధవిహార్ నిర్మాణం కోసం రెండు ఎకరాల స్థలం ఇచ్చి ఉదారత చాటుకున్నారన్నారు. గ్రామాభివృద్ధికి రంగనాథ్‌బాబు సహకారం అందించాలని కోరారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, కొండపల్లి రామకృష్ణ, బండి పరాత్పరరావు, గొర్రెపాటి వెంకట నరసింహారావు పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యం డిప్లొమో పరీక్షలు ప్రారంభం

కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠంలో డిప్లొమో నాట్య పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 30 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా చింతా రవిబాలకృష్ణ, పరిశీలకులుగా డాక్టర్ విజయపాల్, ఎగ్జామినర్లుగా హరనాథ్ శాస్త్రి, వెంకట దుర్గాభవాని వ్యవహరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోడూరు : కోడూరు నుంచి మచిలీపట్నం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై పి.శిరీష తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు గురువారం రాత్రి చిట్టిప్రోలు సుబ్బారావు అనే వ్యక్తి ఆటోలో తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఉల్లిపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అవనిగడ్డలో జాబ్‌మేళా 9న

అవనిగడ్డ : గాంధీక్షేత్రంలో ఈనెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, అంజనాస్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చు నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో 800లకు పైగా ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిరుద్యోగ యువతి, యువకులు ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు గాంధీక్షేత్రానికి చేరుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9290689808 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మహా వారాహి నవరాత్రులు నేటి నుంచి

నాగాయలంక : కృష్ణానదీ తీరాన ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా మహా వారాహి నవరాత్రులు ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీరామపాదక్షేత్రం ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిరోజు సాయంకాల సమయంలో దంపతులచే కుంకుమ పూజ, హారతులు, మంత్రపుష్పం, అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ఘంటసాల : గొర్రెపాటి బసవయ్య - రత్నమాంబ చారిటబుల్ ట్రస్ట్ తరఫున బొల్లపాడు గ్రామంలో పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన లోయ నాగరాజు కుమారుడు జగదీష్‌కు రూ.5 వేలను ప్రవాసభారతీయులు గొర్రెపాటి రంగనాథ్ బాబు చేతులమీదుగా శుక్రవారం అందించారు. ట్రస్ట్ ప్రతినిధులు గొర్రెపాటి వెంకట రంగారావు, గొర్రెపాటి వెంకట నరసింహారావు, గొర్రెపాటి సురేష్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, కొండపల్లి వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుడు చిన్నారికి పరామర్శ

గుడివాడ : వైసీపీ నాయకుల దాడిలో గాయపడి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుడ్లవల్లేరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తోట చిన్నారిని శుక్రవారం జనసేన నాయకులు పలువురు పరామర్శించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, నాయకులు వెంకటేష్, ఇమ్మిడిశెట్టి భాను, సాయి పవన్, నవీన్, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

చల్లపల్లి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నీటి తొట్టెలను వారానికి ఒకసారి శుభ్రపరచుకోవటం ద్వారా ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోగలమని చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు ప్రజలకు సూచించారు. చల్లపల్లిలోని ఎస్టీ కాలనీలో శుక్రవారం ఫ్రైడే - డ్రై డే నిర్వహించారు. గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కోళ్ల పెంపకంపై పరిశోధనకు వీరకుమారికి డాక్టరేట్



అవనిగడ్డ : ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థ శాస్త్ర అధ్యాపకురాలు అన్నపరెడ్డి వీర కుమారికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ప్రొఫెసర్ ఎం.కోటేశ్వరరావు పర్యవేక్షణలో గుంటూరు జిల్లాలో కోళ్ల పెంపకంలో సమస్యలు, అవకాశాలు అనే అంశంపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ ఇచ్చినట్లు పరిశోధనా విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.మధుబాబు, పర్యవేక్షకులు ప్రొఫెసర్ ఎం.కోటేశ్వరరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు వీరకుమారిని అభినందించారు.

విద్యుత్‌లైన్ల పనులు ప్రారంభం

అవనిగడ్డ రూరల్ : నూతన విద్యుత్ లైన్ల విస్తరణ వేగవంతం చేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం అవనిగడ్డ మండలం పులిగడ్డ పాత కోటలో నూతన విద్యుత్ స్తంభాలు వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యుత్ శాఖ ఏడీఈ సుబ్రహ్మణ్యం, ఏఈ టి.ప్రసాద్ పాల్గొన్నారు.

104 సిబ్బంది వినతి

అవనిగడ్డ : ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా 104 సేవలను నిర్వహించేలా చూడాలని,సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ 104 సిబ్బంది శుక్రవారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న 12 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. 104 ఎం ఎంయు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఫణికుమార్, కార్యదర్శి సిహెచ్.రాంబాబు, గౌరవ అధ్యక్షులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యానాదుల కాలనీలో అన్నదానం

మచిలీపట్నం టౌన్ : హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ పేదలకు శుక్రవారం అన్నదానం చేశారు. దుస్తులు పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. తన కుమార్తె హరిత జ్ఞాపకార్థం బాబా ప్రసాద్ ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్ అన్నం ఆనంద్‌తో పాటు మాదిరెడ్డి శ్రీను, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.



మోపిదేవి జడ్పీ పాఠశాలలో విద్యాకిట్లను పంపిణీ చేస్తున్న బుద్ధప్రసాద్



గురుకుల పాఠశాల సందర్శించిన ఎమ్మెల్యే కుమార్‌రాజా



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

అంబేడ్కర్ స్ఫూర్తిగా విద్యార్థులు ఎదగాలి

చల్లపల్లి, జూలై 5 : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్.అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థినులు ఎదగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 640 మంది విద్యార్థినిలకు స్టూడెంట్స్ కిట్స్ ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ అరుణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయ రాధిక, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, షేక్ నబీఘోరి, నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, మోర్ల శివ, పిండి రేవతి, జాబీర్, కార్యదర్శి పివి. మాధవేంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తాం

మోపిదేవి : హైస్కూల్ ప్లస్ (ఇంటర్మీడియట్) విద్యార్థులకు హాస్టల్ వసతి ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కిట్లను ఆయన పంపిణీ చేశారు. విద్యాకుటుంబం ఆధ్వర్యంలో బుద్ధప్రసాద్‌ను సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు డి.జయంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీపీ నడకుదుటి జననీ కుమారి, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, గ్రామ సర్పంచ్ నందిగం మేరీ రాణి, ఉపసర్పంచ్ కోనేరు సుందర్ సింగ్, తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రామలింగేశ్వరరావు, ఎంఈవో దుర్గా సాగర్, ఎంపీటీసీ సభ్యుడు కొమ్ము పవన్, నడకుదుటి జనార్దనరావు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడ చేద్దాం

గుడివాడ : గుడివాడను శుభ్రం చేసుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. ప్రజావేదికలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో పట్టణాభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐ లవ్ గుడివాడ కార్యక్రమం ద్వారా క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడ చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అగస్టు 15న పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రావాలన్నారు. బాగా పని చేసిన స్వచ్ఛంద సంస్థలకు వ్యక్తిగతంగా ప్రతి ఏటా రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల బహుమతులను అందజేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, బీజేపీ ఇన్‌చార్జ్ సురేంద్రబాబు, లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ, లయన్స్ క్లబ్ ప్రగతి, రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ, భారత్ వికాస్ పరిషత్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, ఎన్‌టీఆర్ వాకర్స్‌క్లబ్, గుడివాడ వాకర్స్, మహిళ వాకర్స్ అసోసియేషన్, వాసవి క్లబ్, సేవా భారతి, ఆజాద్ హిం ద్ బోర్డు, వాసవి ఇంటర్నేషనల్ పరివార్, ద్వారకసాయి సేవా సంస్థ, వాసవి కపుల్స్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల సంక్షేమానికి కృషి

పామర్రు : గురుకుల పాఠశాలల విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. నల్లకుంటలోని బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. వసతి గృహాన్ని పరిశీలించారు. సౌకర్యాలను అడిగితెలుసుకున్నారు. క్రీడా ప్రాంగణం అభివృద్ధికి తక్షణ చర్య లు తీసుకుంటామన్నారు. ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌బాబు, కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

మచిలీపట్నం టౌన్ : విద్యార్థులు బాల్యం నుంచి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రభుత్వ లేడీయాంప్థిల్ జూ నియర్ కళాశాల ప్రశాంత ప్రిన్సిపాల్ తలశిల దామోదర్ అన్నారు. బందరు కోట ప్రాథమిక పాఠ శాల వద్ద మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి అంబటి అశోక్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం తోట రఘునాథ్, ఎం. అరవింద్. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోపిదేవి : పర్యావరణ పరిరక్షణ, కాలుష్య రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎమ్మె ల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, దివి గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కోసూరువారిపాలెంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్ర ముఖ వ్యాపారవేత్త కోసూరు ఆనంద్ కుమార్ ఆర్థిక సహకారంతో పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేశారు. సర్పంచ్ కోసూరు అనూ ష, ఎంపీటీ సభ్యుడు సనకా వెంకట రాజేష్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, సాంబయ్య, సునీల్, నాగమల్లేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు టి.చంద్రశేఖర్ ఉన్నారు.



కోసూరివారిపాలెంలో మొక్కలు నాటుతున్న వెంకట్రామ్

వన మహోత్సవానికి సన్నాహాలు

అవనిగడ్డ : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పులిగడ్డ ఎల్‌ఎఫ్‌ఆర్ ప్రాంతంలో వన మహోత్సవ సన్నాహక కార్యక్రమాలు ప్రారంభించారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడంతోపాటు పులిగడ్డ ఎల్‌ఎఫ్‌ఆర్ వద్ద కరకట్టకు అటు, ఇటు మొక్కలు నాటాలని ఇరిగేషన్, డ్రైనేజీ, ఎన్‌ఆర్ ఈజీఎస్, అటవీ శాఖాధికారులతో సమీక్షలో సూచించారు. డాక్టర్ డీఆర్కే ప్రసాద్, ఇరిగేషన్ డీఈ రావెళ్ల రవికిరణ్, డ్రైనేజీ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, అటవీశాఖ డీఆర్‌వో ఏ.ఎల్. అరుణ కుమారి, ఏఈలు చిరంజీవి, కె.శ్రీరామ్ జనార్దన్, కె.హరీష్, రవితేజ, విజయ్, ఏపీవో రవి కుమార్, డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల షాపుల్లో తనిఖీలు

ఘంటసాల : రైతులకు అమ్మిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల ఎరువుల షాపుల యజమానులకు సూచించారు. కొడాలి, శ్రీకాకుళం గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులను ఏవో కె.మురళీకృష్ణతో కలసి ఏడీఏ, తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రూ.3,00,240 విలువ చేసే 22.45 టన్నుల ఎరువులకు తగిన అనుమతి పత్రాలను అందజేసిన పిమ్మట మాత్రమే విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎరువులు, విత్తనాల స్టాకు, ధరల పట్టికను ప్రదర్శించాలని, పూర్తిస్థాయి అనుమతులు ఉన్న ఇన్‌పుట్స్ మాత్రమే రైతులకు అమ్మాలని డీలర్లను ఆదేశించారు. వీఏఏ జి.దయానా, జి.రవిచంద్ర పాల్గొన్నారు. **గుడివాడ రూరల్ :** ఎరువుల షాపుల యజమానులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. ఏవో బోలెం అనంతలక్ష్మితో కలిసి ఎరువుల షాపులను ఆమె తనిఖీ చేశారు. స్టాకు, రికార్డులు పరిశీలించారు. గడువు ముగిసిన మందులను తగులబెట్టాలని, రైతులకు ఎట్టి పరిస్థితుల్లో విక్రయించరాదని హెచ్చరించారు.



కొడాలిలో తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్యామల



గుడివాడలో తనిఖీ చేస్తున్న ఏడీఏ రమాదేవి

విత్తనాల పంపిణీ ప్రారంభం

కోడూరు : ప్రభుత్వం సబ్సిడీపై అందించే బీపీటీ 5204 వరి విత్తనాల పంపిణీని శుక్రవారం కోడూరు ఒకటో రైతు సేవా కేంద్రం వద్ద టీడీపీ, జనసేన నాయకులు ప్రారంభించారు. ఒక కేజీ ధర రూ.41.80 కాగా, ఐదు రూపాయల సబ్సిడీ పోనూ రూ.36.80 చొప్పున రైతులకు అందిస్తున్నట్లు వ్యవసాయ శాఖాధికారి ఎం.శ్రీధర్ తెలిపారు. బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, పి.కరుణకుమార్, విఏఏ షేక్ మరియాంబి, కోట రాంబాబు, కడవకొల్లు మల్లి, పి.లక్ష్మణరావు, టి.నాంచారయ్య, వేములపల్లి రాజేష్, ఎన్.పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



మండలి బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న జనసేన ఎన్నారై నేత శ్రీనివాసరావు

బుద్ధప్రసాద్‌కు జనసేన ఎన్నారై నేత సన్మానం

చల్లపల్లి : తెలుగుభాష, సంస్కృతి వికాసానికి ప్రత్యేక కృషి చేస్తున్న మండలి బుద్ధప్రసాద్ మరోసారి ఎమ్మెల్యే కావటం శుభపరిణామం అని ఎన్నారై జనసేన నాయకులు చందు శ్రీనివాసరావు అన్నారు. చల్లపల్లిలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను చందు శ్రీనివాసరావు, కేఎల్ యూనివర్శిటీ జోనల్ హెడ్ బొల్లిముంత శివరా మకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ప్రజాసేవతోపాటు, కళలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బుద్ధప్రసాద్ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు.

వేమూరి సోదరులకు మండలి పరామర్శ

చల్లపల్లి : మాతృవియోగం పొందిన టీడీపీ సీనియర్ నాయకులు వేమూరి రమేష్‌బాబును ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం పరామర్శించారు. రమేష్‌బాబు మాతృమూర్తి వేమూరి రాజ్యలక్ష్మి(88) ఇటీవల రామానగరంలోని స్వగృహంలో కన్నుమూశారు. రాజ్యలక్ష్మి చిత్రపటానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియచేశారు. రమేష్‌బాబు సోదరులు వేమూరి జగన్మోహనరావు, వేమూరి శివరామకృష్ణ, మల్లంపల్లి శివరామకృష్ణ ఉన్నారు.

అతిసార ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మచిలీపట్నం టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో అతిసార ప్రబలకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పావని అన్నారు. గొల్లపాలెంలో అవగాహనా సదస్సులో పావని మాట్లాడారు. పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. జిల్లా ఆరోగ్య విద్య విస్తరణాధికారి సాంబ శివారెడ్డి, మలేరియా అధికారి మురళి, ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రకుమార్, పి.వి. పరమేశ్వరరావు, వసుంధరాదేవి, మోహనరావు, గాయత్రి, మురళి పాల్గొన్నారు.

కౌలురైతులకు సాగు కార్డులపై అవగాహన

మచిలీపట్నం టౌన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలో 70 వేల మంది కౌలు రైతులకు పంటసాగు హక్కు కార్డులను ఇవ్వనుందని, కౌలు రైతులు దగ్గరలోని వ్యవసాయ శాఖాధికారిని సంప్రదించి కార్డులు పొందవచ్చని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు గ్రామ సచివాలయంలో కౌలు రైతులకు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కౌలు దారులు తాము సాగు చేస్తున్న భూమిని వీఆర్వోలు, ఆర్‌ఐలకు తెలపాలన్నారు. కౌలుదారుల హక్కు పత్రాలు పొందడం వల్ల ధాన్యం కొనుగోళ్లు, ప్రభుత్వం ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ సులభంగా పొందగలుగుతారన్నారు. పి. రాము, ఏడుకొండలు, నాని, గోపు వెంకటరమణ, ఈమన సత్యనారాయణ, మోకా వెంకన్న, వంకా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ నేడు

గుడ్లవల్లేరు : ప్రపంచ పెంపుడు జంతువుల సంరక్షణ దినం సందర్భంగా పశు వైద్యశాలలో పెంపుడు సునకాలకు వ్యాక్సినేషన్, నులిపురుగుల నివారణ మందు వేయడం జరుగుతుందని లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. **బంటుమిల్లి :** ప్రపంచ జునోసిస్ డే శనివారం పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ స్ఫూర్తి తెలిపారు. **చల్లపల్లి :** జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చల్లపల్లి పశువైద్యశాలలో రాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్‌వి.భార్గవ తెలిపారు.

ఆటోబోల్తా - డ్రైవర్ అపస్మారకం

బంటుమిల్లి : నారాయణపురం- పెదపట్నం రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఉల్లిపాయల ఆటో బోల్తా కొట్టింది. ముల్లపర్రు గ్రామానికి చెందిన సుభాష్ చంద్రబోస్ ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా తిరుగుతుండగా, నారాయణపురం-పెదపట్నం రోడ్డులో అదుపు తప్పి ఉల్లిపాయల ఆటో పొలాల్లో బోల్తా కొట్టింది. డ్రైవర్ సుభాష్ చంద్రబోస్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరడంతో 108 వాహనం ద్వారా మచిలీపట్నం తరలించారు.

ఏపీసీపీడీసీఎల్ యాప్ ద్వారా బిల్లులు చెల్లించండి

మచిలీపట్నం టౌన్ : విద్యుత్ వినియోగదారులు ఏపీసీపీడీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఎలక్ట్రికల్ ఈఈ మన్నెం భాస్కరరావు తెలిపారు. వినియోగదారుల అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. యాప్ ద్వారా బిల్లులు చెల్లించడం సులభతరం అని, సమయం ఆదా అవుతుందన్నారు. ఈఈ కటకం రామకృష్ణ, ఏఈ రమణ పాల్గొన్నారు.

మంత్రి రవీంద్ర రెండో విడత ప్రజాదర్బార్ రేపు

మచిలీపట్నం టౌన్ 5 : ప్రజా సమస్యలపై మంత్రి రవీంద్ర ఈనెల 7వ తేదీ ఆదివారం ఉదయం 8.30 నుంచి దుర్గామహల్ పక్కన ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నేరుగా వినతిపత్రాలు స్వీకరిస్తారని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ వెల్లడించారు. మొదటి విడత ప్రజాదర్బార్‌లో 292 వినతిపత్రాలు వచ్చాయన్నారు. వీటిల్లో 45 సమస్యలను పరిష్కరించారన్నారు. 137 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ఉద్యోగాలకు, రేషన్‌కార్డులకు, ఇళ్లస్థలాలు దరఖాస్తులు వచ్చాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక కళాశాలల్లో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఎండి ఇలియాస్ పాషా, కాంతారావు, కుంచే నాని మాట్లాడారు.

ప్రతిరోజూ ప్రజా పరిష్కార వేదిక

నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రతి రోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదికను ఏర్పాటు చేశామని కమి షనర్ బాపిరాజు తెలిపారు. తాగునీరు, శానిటేషన్, వీధి దీపాలు, రోడ్ల ఆక్రమణలు, మురుగునీటి సమస్య లపై నగర పాలక సంస్థ కార్యాలయంలో, వాట్సాప్ 9849907989 గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు.